క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



కార్పొరేటర్ నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింథియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో గెలుపొందిన షిప్ యార్డ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) నాయకులు ఆదివారం 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో కార్మికులు నమ్మకంతో ఐఎన్‌టీయూసీకి అఖండ విజయం అందించారన్నారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ సి.ఎస్.ఆర్.మూర్తి, అధ్యక్షుడు పి.జె.హెచ్.బోసు, కె.ఎంజీ.గణేష్, సురేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి



కొత్తపాలెంలో బీఎల్‌వోకు సూచనలిస్తున్న ఆర్డీవో హుస్సేన్

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పోలింగ్ బూతుల్లో ఆదివారం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదే కేంద్రాలను ఆర్డీవో హుస్సేన్ పరిశీలించారు. కొత్తపాలెం, వెంకటాపురం ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న ఇబ్బందులను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు ఉన్నారు.

కళ్లద్దాల పంపిణీ



పేదలకు కళ్లద్దాలు అందజేస్తున్న మౌర్యసింహా

సింథియా : జీవీఎంసీ 62వ వార్డులో ఇటీవల నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి అద్దాలు అవసరమని గుర్తించిన వారికి ఆదివారం స్థానిక ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్యసింహా చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. భవిష్యత్తులో మరింత మంది పేదలకు ఉచిత వైద్య చికిత్సతో పాటు మందులు, అవసరమైన వారికి కంటి అద్దాలు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మజ్జి మాలి నాయుడు, జోగిబాబు, చైతన్య, దుర్గారావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలుపుతున్న విజయ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ఖార్వేల్ నగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. పొన్నాడ రమణారావు(పెప్సీరమణ), వైస్ ప్రెసిడెంట్‌గా పూజారి వేణుగోపాలరావు, కార్యదర్శిగా బెహరా శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా మళ్ల శ్రీనివాసరావు కోశాధికారిగా దుంపల ఆనందరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని బొడ్డేటి విజయ్ సత్కరించారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు.ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో నగర ప్రజలు అర్జీలు పెట్టుకోవచ్చు.

పవర్‌ఫుల్

- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ గోడల నిర్మాణం
- కండక్టర్ల మార్పు, నూతన బ్రేకర్ల ఏర్పాటు
- నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కెపాసిటీ పెంపు





ఇందిరానగర్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద నిర్మించిన రక్షణ గోడ

గోపాలపట్నం: విద్యుత్ అంటేనే ప్రమాదకరమైంది. అప్రమత్తంగా లేకపోతే ప్రాణాంతకమవుతుంది. ఇది లేకపోతే ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితి. అలాంటి విద్యుత్ వ్యవస్థను ప్రభుత్వం గాడిన పెట్టింది. నాణ్యమైన విద్యుత్ అందివ్వడమే కాకుండా... ప్రజల భద్రతకు కూడా తగిన ప్రాధాన్యమిస్తోంది వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం. విద్యుత్ సరఫరాలో నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకు అవసరమైన నిర్వహణ పనులు చేపట్టింది. భద్రతా చర్యల్లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ గోడలు నిర్మించింది. ప్రమాదకరంగా ఉన్న లైన్లు మార్చింది. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది.

రక్షణకు పెద్దపీట

జన సంచారం ఎక్కువగా ఉన్న చోట ట్రాన్స్ ఫార్మర్లకు రక్షణ గోడలు, ఫెన్సింగ్ నిర్మిస్తున్నారు. వాటికి రంగులు వేస్తున్నారు. ప్రత్యేకంగా రక్షణ చర్యలకు సుమారు రూ. 3 కోట్లు వెచ్చించారు. గోపాలపట్నం సబ్ స్టేషన్ పరిధిలో 150 కొత్త స్తంభాలు వేశారు. అలాగే 15 కిలో మీటర్ల వరకు కండక్టర్లు వేశారు. ఈ కండక్టర్లు లక్ష్మీనగర్, ఎన్ఏడీ, గాంధీనగర్, చంద్రనగర్, యల్లపువానిపాలెం, బాజీజంక్షన్ ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు కొత్తవి వేశారు. మరి కొన్ని చోట్ల పనులు ప్రగతిలో ఉన్నాయి.

ట్రాన్స్ ఫార్మర్ల మార్పు... కెపాసిటీ పెంపు...

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్ ఫార్మర్లను కొత్తవి వేయడం, పాత వాటి స్థానంలో కొత్తగా కెపాసిటీ పెంచే చర్యలు చేపడుతున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న విద్యుత్ వాడకాన్ని బట్టి ఈ చర్యలు చేపడుతున్నారు.

- 100కేవీఏ(కిలో వాల్టు యాంపియర్) ట్రాన్స్ ఫార్మర్లు ఇందిరానగర్‌లో, బాజీ జంక్షన్, లక్ష్మీనగర్‌లో కొత్తవి వేశారు.
- 100కేవీఏ ట్రాన్స్ ఫార్మర్ తొలగించి 160 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్లను గోపాలపట్నం వుడా కాలనీ, బాజీ జంక్షన్, యల్లపువానిపాలెంలో యల్లపువానిపలెం కమ్యూనిటీ హాలు వద్ద, ఇందిరానగర్, భగత్‌సింగ్‌నగర్‌లో 40కేవీఏ నుంచి 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ వేశారు.

బ్రేకర్ల మార్పు

విద్యుత్ సరఫరాను సరళీకృతం చేయడం... ఏదైనా షార్ట్ అయితే వెంటనే పవర్ కట్ అవడం వంటి కంట్రోలింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఇందుకు సుమారు రూ. 25లక్షలు వెచ్చించారు. ఇది కొత్తపాలెం సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. పాత వాటి స్థానంలో కొత్తంగా మూడు ఏర్పాటు చేయగా కొత్తగా యల్లపువానిపాలేనికి విద్యుత్ సరఫరా చేసే లైన్‌లో ఒకటి ఏర్పాటు చేశారు. విద్యుత్ సంస్కరణల వల్ల ప్రజలకు భద్రతతో కూడిన నాణ్యమైన విద్యుత్ అందుతోంది. ముందస్తు ప్రణాళికతో ప్రభుత్వం, అధికారులు తీసుకుంటున్న చర్యలు ఇందుకు దోహదపడుతున్నాయి.

గోపాలపట్నంలో 150 స్తంభాల ఏర్పాటు

15 కిలోమీటర్ల పరిధిలో కండక్టర్ల ఏర్పాటు

రూ.3 కోట్లతో రక్షణ గోడల నిర్మాణం



గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నిర్మించిన రక్షణ గోడ



ఇందిరాప్రియ దర్శిని నగర్‌లో..



రాజీవ్ కల్యాణ మండపం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ సరఫరా బాగుంది



మా ప్రాంతంలో విద్యుత్ సరఫరా చాలా బాగుంది. ఇక్కడ కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో మా కష్టాలు తీరినట్లయింది. అంతే కాకుండా తోటపోలమాంబ ఆలయం వద్ద కెపాసిటీ పెంచి మరో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారు.

– డానియల్, బాజీ జంక్షన్, ఎస్సీ కాలనీ

రక్షణ చర్యలు భేష్



గతంలో ట్రాన్స్‌ఫార్మర్లను చూస్తే భయానకంగా ఉండేవి. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. విద్యుత్ శాఖ అధికారులు చేపడుతున్న చర్యలు బాగున్నాయి. అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ గోడలు, ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో నాణ్యత పెంచారు. ఇబ్బంది ఏర్పడితే సిబ్బంది వెంటనే స్పందిస్తున్నారు.

–సీహెచ్ పైడిరాజు రెడ్డి

సమస్యలు తీరాయి



కొత్తపాలెంలో చాలా మేరకు విద్యుత్ సమస్యలు తీరాయి. శివారు ప్రాంతం కావడంతో గతంలో వినియోగదారులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ఇక్కడి సబ్‌స్టేషన్‌లో సరఫరా నాణ్యత పెంచారు. కొత్తగా బ్రేకర్లు వేయడం వల్ల ఇబ్బందులు తలెత్తడం లేదు. అలాగే ట్రాన్స్ ఫార్మర్లు కూడా మార్చారు. దీని వల్ల విద్యుత్ సమస్యలు తలెత్తడం లేదు.

– అయితంశెట్టి గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు

భారీ అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న బద్రీనాథ్

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని శ్రీగౌరీపరమేశ్వరుల మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సుమారు 3000 వేల రకాల పిండి వంటలతో సారె ఊరేగింపు నిర్వహించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, గౌరీ సేవా సంఘం గౌరవాధ్యక్షులు బుద్ధ సత్యనారాయణ గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం చేపట్టిన భారీ అన్నసమారాధనను కార్పొరేటర్ నాగేశ్వరరావు ప్రారంభించారు. సోమవారం సాయంత్రం దీపారాధన నిర్వహించేందుకు సంఘ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాఖ విద్య: ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కాకాని నగర్, ఎన్ఏడీ, దుర్గాపురం 11కేవీ ఫీడర్ల పరిధిలోని కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందన్నారు. సాకేతపురం, వినోద్ నగర్, కాకాని నగర్, విమాన్ నగర్, రజక కాలనీ, ఎయిర్‌పోర్టు, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఎన్ఎస్ డేగ, దుర్గాపురం, ఎన్ఏడీ చర్చి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లో గల వినియోగదారులు సహరికరించాలని కోరారు.

దివ్యాంగుల రిజర్వేషన్లు అమలు చేయాలి



దివ్యాంగుల సంఘానికి ఆర్థిక సాయం చేస్తున్న భాగ్యలక్ష్మి

సింథియా : దివ్యాంగులకు ఇచ్చిన రిజర్వేషన్లను ప్రభుత్వాలు అమలు చేయాలని, వారికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జాతీయ సేవా పథకం జిల్లా అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆదివారం జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్‌లోని శ్రీ విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల విద్య, వైద్యం, ఉపాధికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సకాలంలో పెన్షన్ అందాలని, సాంకేతిక లోపాల పేరుతో పెన్షన్ ఆపకూడదని అన్నారు. అనంతరం వెంకట రవి మాట్లాడుతూ దివ్యాంగులు తమ శక్తి సామర్థ్యాలను పెంచుకోవాలని, ఆత్మ విశ్వాసం కోల్పోకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి అనసూయాదేవి దివ్యాంగులన్న ప్రత్యేక సదుపాయాలు, పథకాలను వివరించారు. అనంతరం దివ్యాంగులకు కృష్ణవేణి నిత్యావసర సరకులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో కొండబాబు, కుమారి, అంజలి, వెంకటరమణ, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవం

సింథియా : మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయబాబు ఆధ్వర్యంలో గాజువాక డిపో సమీపంలోని అంజనేయస్వామి ఆలయం వద్ద విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ దేశ ప్రజలు నరేంద్ర మోదీని మళ్లీ ప్రధాన మంత్రిని చేయాలని కోరుకుంటున్నారన్నారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాసరావు, గురుమూర్తి, రమేష్, అప్పలరాజు, జానీ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ విద్య: రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులతో కలసి ఆదివారం ఎన్ఏడీ సెంటర్‌లో విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. రమేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజల్లో అపారమైన నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పొలిమేర శ్రీనివాసరావు, మంజుల, జ్యోతి, వెంకటేశ్వరరావు, అప్పలరాజు, నారాయణరావు, మహేష్, పటేల్, చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



కోలాటంలో పాల్గొన్న మహిళలు

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్ గవర పాలెంలో నిర్వహిస్తున్న శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక వేదికపై కొలువు దీరిన గౌరీ పరమేశ్వరులను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక మహిళలతో వేదిక ప్రాంగణంలో కోలాటం నిర్వహించారు. అమ్మవారి సన్నిధానంలో నిర్వహించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది.

రైతు బజారులో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని సమీక్షిస్తున్న ఏడీఎం షేక్ యాసీన్

గోపాలపట్నం : గోపాలపట్నం రైతు బజారులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రైతులకు పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి షేక్ యాసీన్ ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు జాగ్రత్తల గురించి వివరించేందుకు ఈ శిబిరం దోహద పడుతుందన్నారు. ఈ శిబిరానికి ఇండస్ ఆసుపత్రి యాజమాన్యం సహకరించిందని తెలిపారు. యాజమాన్యానికి, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు బజారు ఈవో నారాయణరావు, సహాయకుడు శివ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కార్మికులందరూ పోరాటాలతో కాపాడుకుంటారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1025వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులతో పాటు స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ యూనియన్ కార్మికులు పాల్గొని, కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కాలేజీల్లో అప్రమత్తంగా ఉండాలి

విశాఖ విద్య: తుపాను ప్రభావంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లాలోని జూనియర్ కాలేజీల నిర్వాహకులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డీవీఈవో బి.రాధ ఒక ప్రకటనలో సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యార్థులను కూర్చోబెట్టకూడదని, లీకేజీలు ఉన్న గదుల్లో తరగతులను నిర్వహించవద్దన్నారు. నాడు–నేడు పనులు జరుగుతున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెటీరియల్ పాడవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

యువకుడికి గాయాలు



గాయపడిన హేమంత్

గోపాలపట్నం: విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలైన ఘటన బాజీజంక్షన్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికలు, గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు.. పద్మనాభ మండలం రామభద్రపురానికి చెందిన జి. హేమంత్ విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. వెంటనే స్పందించిన సిబ్బంది సరఫరాను నిలిపివేసి గాయపడిన హేమంత్‌ను నగరంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాజీ జంక్షన్‌లో శనివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని లార్రీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఇది గమనించి విద్యుత్ శాఖ సిబ్బంది తెగిపడిన విద్యుత్ తీగలను తొలగించారు. ఉదయం సమయంలో విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. ఆ స్తంభానికి విద్యుత్ తీగలు కలిపే పని సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

'ఒంటి కాలు పరుగు' పుస్తకావిష్కరణ



సాహితీ సభలో మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

మహారాణిపేట : తెలుగు భాష, సాహిత్యాలను పరిపుష్టం చేస్తూ రచనలు చేసిన ఘనత డాక్టర్ బండి సత్యనారాయణ సొంతమని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. ఆదివారం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన ఒంటి కాలు పరుగు కవిత్వ సంపుటిని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యనారాయణ గొప్ప రచనలు చేశారన్నారు. సామాజిక స్పృహతో మానవీయ కోణంలో ఆయన రచనలు ఉంటాయన్నారు. స్త్రీవాదాన్ని సమర్థిస్తూ కవితలు రాశారని అన్నారు. ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.సుబ్బారావు మాట్లాడుతూ కొత్తగా కవితలు రాసే వారిని ప్రొత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి కార్యక్రమాల విభాగాధిపతి బేతా రామ సూర్య ప్రకాశరావు, ప్రముఖ కవి, రచయిత గరిమెళ్ల నాగేశ్వరరావు, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, డి.వి.సూర్యారావు, మేనేజర్ పి.ఎ.రాజు, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'వాసీవా' స్వర్ణోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఆటోనగర్ పారిశ్రామికవేత్తలు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీసీ రోడ్డులోని కాకతీయ ఐటీఐ వ్యాలీలో నిర్వహించిన వనసమారాధనలో వాసీవా ప్రతినిధులు, సీనియర్ పారిశ్రామిక వేత్తల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పారిశ్రామిక వేత్తలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడ్ఎం జయబాబు, ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, ఎన్ఎస్ఐసీ అధికారులు కమలేశ్వరి, అశ్విన్, ఐలా కమిషనర్ జయచంద్ర, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.